సాక్షి సంగారెడ్డి


శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



వక్ఫ్ భూములపై ఆశలు

వ్యవసాయ భూములను వక్ఫ్ బోర్డు కిందకు చేర్చడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

వివరాలు 8లో ▸



రేలింగ్‌ను ఢీకొట్టిన బస్సు

జహీరాబాద్‌లోని రైల్వే పై ఓవర్ బ్రిడ్జిపై అదుపుతప్పిన ఓ ప్రైవేటు బస్సు రేలింగ్‌ను ఢీకొట్టింది.

వివరాలు 8లో ▸



రక్ష 'కాటమయ్య కిట్స్'

కాటమయ్య సేఫ్టీ కిట్స్‌తో గీత కార్మికులు ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవచ్చు.

వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

- ఆర్టీసీ ఎండి సజ్జనార్



నిమజ్జనంలో పాల్గొన్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

పటాన్‌చెరు టౌన్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. లింగంపల్లి సమీపంలోని తన స్వగృహంలో ప్రతిష్ఠించిన గణనాథున్ని బుధవారం రాత్రి అమీన్‌పూర్ మండలం బీరంగూడ లోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంతంలో ఉన్న పురాతన బావిలో నిమజ్జనం చేసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా గణనాథునికి పూజలు చేసి, అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న పురాతన బావిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అర్చకులు, అమీన్‌పూర్ సీఐ సదా నాగరాజు పాల్గొన్నారు.

త్వరలో పేట ఆస్పత్రిలో డయాలసిస్



వైద్య సేవల గురించి తెలుసుకుంటున్న డీసీహెచ్ఎస్ సంగారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో ప్రభుత్వ ఆస్పత్రిలో త్వరలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు డీసీహెచ్ఎస్ సంగారెడ్డి తెలిపారు. గురువారం పేట ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. అనంతరం డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది తప్పక సమయపాలన పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో సెలవులు ఇవ్వొద్దని సూపరింటెండెంట్ విజయశంకర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు సత్యనారాయణ, షోయబ్, అనిల్, మల్లయ్య పాల్గొన్నారు.

మీ సేవలో 'క్యూఆర్‌కోడ్' చెల్లింపులు

పుల్‌కల్(అందోల్) : మీసేవ కేంద్రాల్లో చెల్లింపులన్నీ' క్యూ ఆర్‌కోడ్ ద్వారానే చెల్లించాలని ఈ–డిస్ట్రిక్ మేనేజర్ ఉదయ్‌కుమార్, టీజీటీఎస్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ సూచించారు. గురువారం మీసేవ వీఎల్ఈ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండు నెలల నుంచి రెవెన్యూ శాఖ దరఖాస్తులకు డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. వినియోగదారులకు పూర్తి అవగాహన వచ్చిన తర్వాత మీసేవ లోని ప్రతీ శాఖ దరఖాస్తుకు క్యూఆర్ కోడ్ ద్వారానే చెల్లించాలని సూచించారు. క్యూఆర్‌కోడ్ ద్వారా అధిక చెల్లింపులకు ఆస్కారం లేకుండా పారదర్శకత ఉంటుందని తెలిపారు.

28న మెగా లోక్ అదాలత్

నారాయణఖేడ్: ఈనెల 28న నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మందాని సూచించారు. రాజీమార్గంలో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు.

పారిశుద్ధ్యంపై అలసత్వం వద్దు

హత్నూర(సంగారెడ్డి): పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీఓ అనిత హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని కొన్యాల గ్రామాన్ని ఆమె సందర్శించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి పైపులైన్‌కు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



కొన్యాల గ్రామంలో పర్యటిస్తున్న డీఎల్‌పీఓ అనిత

రూ.45 లక్షలకు 'స్పాట్'..!


విద్యుత్ స్పాట్ బిల్లింగ్ చార్జీల చెల్లింపుల్లో అవకతవకలు

- ఉద్యోగులు, సిబ్బందితో పనిచేయించి.. కాంట్రాక్టరుకు బిల్లులు
- కట్టబెట్టేందుకు రంగం సిద్ధం
- విద్యుత్ శాఖలో అక్రమాల బాగోతం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : విద్యుత్‌శాఖలో స్పాట్ బిల్లింగ్ చార్జీల చెల్లింపుల్లో అక్రమాల బాగోతం కొనసాగుతోంది. ఆ శాఖ సిబ్బందితో పని చేయించి.. ఇందుకు చార్జీలు మాత్రం కాంట్రాక్టరుకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇలా సుమారు 23 నెలల బకాయిలు సుమారు రూ.45 లక్షల వరకు చెల్లించేందుకు గుట్టుచప్పుడు కాకుండా పావులు కదుపుతున్నారు. ఇందుకు కొందరు ఇంజనీరింగ్ అధికారులు తమ పర్సంటేజీల కోసం కాంట్రాక్టరుకు వంత పాడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ ఇలా..

ఇంటింటికీ తిరిగి నెలలో వాడిన విద్యుత్ యూనిట్ల సంఖ్యను మిషన్‌లో నమోదు చేసి, వినియోగదారునికి బిల్లులు ఇచ్చే ప్రక్రియను స్పాట్ బిల్లింగ్ అంటారు. ఇలా ఇచ్చే బిల్లులతో వినియోగదారులు విద్యుత్‌చార్జీలు చెల్లిస్తుంటారు. ఈ స్పాట్ బిల్లింగ్ చేసేందుకు పూర్తి స్థాయిలో సిబ్బంది లేక పోవడంతో విద్యుత్‌శాఖ 50 శాతం కనెక్షన్లను ప్రైవేటు కాంట్రాక్టర్లతో స్పాట్ బిల్లింగ్ చేయిస్తోంది. ఉదాహరణకు ఒక మండలంలో సుమారు 20 వేల విద్యుత్ కనెక్షన్లు ఉంటే.. ప్రతినెలా పది వేల కనెక్షన్ల స్పాట్ బిల్లింగ్ విద్యుత్‌శాఖ ఉద్యోగులు చేయాలి. మిగిలిన పది వేలు కాంట్రాక్టరుకు అప్పగించి ఆ కాంట్రాక్టరు తన సిబ్బందితో చేయించాలి. ఇలా స్పాట్ బిల్లింగ్ చేసినందుకు ఒక్కో కనెక్షన్‌పై ప్రతినెలా రూ.4.55ల చొప్పున కాంట్రాక్టరుకు చెల్లిస్తుంది. అలాగే స్పాట్ బిల్లింగ్ చేసే పరికరానికి ఒక్కో బిల్లుపై 33 పైసల చొప్పున ఇస్తోంది. ప్రతినెలా 10 తారీకులోపు ఈ స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి.



జిల్లాలో కొన్నిచోట్ల స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ అస్తవ్యస్తంగా తయారైంది. పటాన్‌చెరు డివిజన్‌నే ఉదాహరణగా తీసుకుంటే.. ఈ డివిజన్‌లో సుమారు 1.08 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 50 శాతం కనెక్షన్లకు సంబంధించిన స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టర్ చేయాల్సి ఉంటుంది. కానీ చాలా వరకు ఈ ప్రాంతంలో స్పాట్ బిల్లింగ్‌ను విద్యుత్‌శాఖ సిబ్బందితోనే చేయిస్తున్నారు. కానీ చార్జీలు మాత్రం పూర్తిగా కాంట్రాక్టరుకు చెల్లించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. 2022 అక్టోబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఈ చార్జీలు చెల్లించేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకు ఆయా సెక్షన్ల ఇంజనీరింగ్ అధికారులు కూడా పర్సంటేజీలు తీసుకుని సహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

విద్యుత్ సిబ్బందితో చేయించి..

రెవెన్యూ మీద ప్రభావం పడుతుందనే కారణంగా..

స్పాట్ బిల్లింగ్ ఆలస్యమైతే విద్యుత్‌శాఖకు రావాల్సిన ఆదాయంపై ప్రభావం పడుతుంది. ఆలస్యంగా స్పాట్ బిల్లింగ్ జరిగితే వినియోగదారులు ఆలస్యంగా బిల్లులు చెల్లిస్తారు. ఇలా విద్యుత్ శాఖకు ప్రతినెలా కలెక్షన్ లేటవుతుందనే సాకు చూపుతున్న అధికారులు.. కాంట్రాక్టర్ చేయాల్సిన స్పాట్ బిల్లింగ్‌ను విద్యుత్‌శాఖ సిబ్బందితో చేయిస్తున్నారు. జేఎల్ఎంలు, లైన్‌మెన్లు బిల్లింగ్ చేయిస్తూ.. ఇందుకు చార్జీలు మాత్రం కాంట్రాక్టరుకు పూర్తి స్థాయిలో చెల్లించేందుకు పావులు కదుపుతున్నారు. ఇలా 2022 నుంచి ఈ ఏడాది మార్చి వరకు సుమారు రూ.45 లక్షలు చెల్లించేందుకు పావులు కదులుతున్నాయి. దీనిపై విద్యుత్‌శాఖ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రభును 'సాక్షి'ప్రతినిధి వివరణ కోరగా, ఈ బిల్లుల చెల్లింపు కోసం పెట్టిన రికార్డులను రిజెక్టు చేశామని అన్నారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల అప్రూవల్‌కు పంపామని చెప్పారు.

పిల్లలు తగినంత బరువు ఉండాలి

పటాన్‌చెరు టౌన్: పిల్లలు తగినంత బరువు ఉండేలా చూసుకోవాలని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మోతి సూచించారు. గురువారం డివిజన్ పరిధిలోని ఆలివ్స్‌కాలనీ లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర బృందం సభ్యులు స్వరూప, వాసవిలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌టీఎస్ (న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం) యాప్ పై పిల్లల ఎత్తు, బరువు వివరాల నమోదును పరిశీలించారు. అనంతరం ప్రీస్కూల్ చిన్నారుల బోధన తీరును పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సల్మా, మనీ పాల్గొన్నారు.



పిల్లల బరువును పరిశీలిస్తున్న ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మోతి

చెత్త సమస్య లేకుండా చూడాలి



డంపు యార్డును పరిశీలిస్తున్న డీపీఓ సాయిబాబా

కంది(సంగారెడ్డి) : గ్రామంలో చెత్త సమస్య లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సాయిబాబా సూచించారు. గురువారం కందిలో ఏర్పాటు చేసిన డంపు యార్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా డంపుయార్డుకు చేర్చి సేంద్రియ ఎరువును తయారు చేయాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామ పరిధిలోని దాబాలు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులతో చర్చించి చెత్త సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే డంపు యార్డును మరింత విస్తరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, బిల్ కలెక్టర్ మల్లేశం పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద బీజేపీ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ విదేశాలకు వెళ్లి దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆర్థిక వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తూ మాట్లాడటం దారుణమన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. రాహుల్ గాంధీ బేషరతుగా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పోచారం రాములు, అనంతరావు, ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.



రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నేడు జాబ్ మేళా

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఈడీసీ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో రెడ్డి ల్యాబ్ వారి సహకారంతో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కేఎస్ రత్నప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023– 24లో బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన అభ్యర్థులు మాత్రమే అర్హులని, అదేవిధంగా 60 శాతం మార్కులతో పాసై ఉండాలని సూచించారు. కంపార్ట్‌మెంట్ పరీక్షలో ఉత్తీర్ణత అయినవారు, చదువులో గ్యాప్ వచ్చినవారు జాబ్‌మేళాకు అనర్హులని తెలిపారు. అభ్యర్థులు మార్కుల మెమో తోపాటు ఆధార్, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్, జిరాక్స్ సెట్లతో పాటు మూడు పాసుపోర్ట్ సైజు ఫొటోలు, తీసుకురావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సంవత్సరానికి రూ.2 లక్షల 10 వేల వేతనంతో పాటు స్టైఫండ్, రవాణా సదుపాయం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 94410 69020 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సీజ్ చేసిన వాహనాల వేలం

సంగారెడ్డి జోన్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీజ్ చేసిన వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఎస్పీ రూపేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసులలో 289 వాహనాలు యజమానుల వివరాలు లేకుండా ఉన్నాయని తెలిపారు. సరైన ఆధారాలు, పత్రాలతో వాహనాలపై కేసులు లేకుండా చేసుకొని వాహనాలను తీసుకుపోవచ్చని సూచించారు.వాహనాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే నోటిఫికేషన్ విడుదల చేసిన తేది ఆగస్టు 31 నుంచి ఆరు నెలల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిబంధనల మేరకు ఆరు నెలల తర్వాత వాహనాలను బహిరంగ వేలం వేయడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవ రావు, ఇన్‌స్పెక్టర్ లాలు నాయక్ 87126 56726ను సంప్రదించాలని సూచించారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

కొండాపూర్(సంగారెడ్డి): మండల కేంద్రమైన కొండాపూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జెడ్పీహెచ్ఎస్, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గిర్మాపూర్‌లోని గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ మాధురి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ధరణి రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు. పీహెచ్‌సీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వైద్య అధికారులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మందులు, ప్రసవాల సంఖ్య, కు.ని. ఆపరేషన్ల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. అదేవిధంగా గిర్మాపూర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠాలను ఉత్తమంగా బోధించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిత, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



గిర్మాపూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మాధురి

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రుణమాఫీ



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

మునిపల్లి(అందోల్): రుణమాఫీకి సంబంధించి రేషన్‌కార్డు లేని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ రైతులను కోరారు. గురువారం మండలంలోని ఖమ్మంపల్లి, మునిపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అంతకు ముందు మునిపల్లి రైతువేదికలో వ్యవసాయ విస్తరణ అధికారులు రహీమాన్, లావణ్య, స్నేహ, అంజనేయులు, నిఖితలతో కలిసి మాట్లాడారు. రూ.2 లక్షల పైన ఉన్న డబ్బులను బ్యాంకులో కడతామని, మిగతావి మాఫీ చేయాలని కొందరు కోరారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదని వివరించారు. ఒక రేషన్ కార్డు ఉండి రూ.4.5 లక్షలు ఉన్న రైతులకు రూ.2లక్షల మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేయలేదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రుణమాఫీ అయిందన్నారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం మంజూరు చేయాలని పలువురు రైతులు వ్యవసాయాధికారులను కోరారు. నష్టం వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఈఈ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. మిషన్ భగీరథలోని జీకేఆర్ సంస్థలో పనిచేస్తున్న 200 మంది కార్మికులకు 10 నెలల నుంచి వేతనాలు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం నుంచి నెలకు ఒక్కొక్క కార్మికునికి రూ.16 వేలు ఇస్తుంటే.. కాంట్రాక్టర్ కేవలం రూ.9,500 మాత్రమే చెల్లిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, నర్సింలు, లక్ష్మణ్, లింగం, రియాజ్, సదానందం, రాములు, యాదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

ఆస్పత్రి నిర్వహణలో లోపాలుంటే చర్యలు



చరిత ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు

సంగారెడ్డి : పట్టణంలోని నాలుగు ప్రైవేట్ ఆస్పత్రులను స్టేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు గురువారం తనిఖీ నిర్వహించారు. ఫోర్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పుష్పవాణి, ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రవితేజ ఆధ్వర్యంలో శ్రీ చరిత, మంజీర, వినోద్, శిశురక్ష ఆస్పత్రుల్లో రికార్డులను పరిశీలించారు. వాటికి సంబంధించిన కాపీలను తీసుకెళ్లారు. వాటిని పరిశీలించి నివేదికను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సమర్పించిన తర్వాత ఏమైనా లోపాలు ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ జి.గాయత్రీ దేవి, రవి, సునీల్ రాజ్, రమావాణి, అనిల్ కుమార్, వెంకట్ రామ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

హత్నూర(సంగారెడ్డి): గ్రామాలలోని మహిళా సంఘాల బలోపేతానికి వీఓఏలు కృషి చేయాలని ఐకేపీ డీపీఎంలు జయశ్రీ, శ్రీనివాసులు అన్నారు. గురువారం హత్నూర ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళా శక్తి రుణాలు ఉపయోగించుకొని మహిళలు వ్యాపార రంగాల్లో రాణించాలని సూచించారు. ఏపీఎం దేవేందర్, సీసీలు మహేష్, కల్పన వీఓఏలు ఉన్నారు.

స్టేడియాల నిర్మాణానికి స్థలాల ఎంపిక



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్ : క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఖేడ్‌లో ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియాల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ అధికారి ఖాసీంబేగ్, ఆర్డీఓ అశోక చక్రవర్తి, తహసీల్దార్ భాస్కర్, జిల్లా స్పోర్ట్స్ అధికారులు హబీబ్, పవన్, కల్యాణ్, పవన్ కుమార్‌లతో కలిసి పట్టణంలోని తహసీల్ గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం కోసం, జూకల్ శివారులోని డిగ్రీ కళాశాల వెనుకాల ఔట్‌డోర్ స్థలాలను గురువారం పరిశీలించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, ఇంజనీర్ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

తాగునీటికోసం ప్రతిపాదనలు

నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.80కోట్లతో ప్రతిపాదించినట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రఘువీర్, ఈఈ పాష, గ్రిడ్ డిప్యూటీ ఈఈ అరవింద్, ఏఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ ఫణివర్మలతో గురువారం సమీక్ష నిర్వహించారు. భగీరథ పథకానికి అదనంగా గ్రామాల్లో ప్రత్యామ్నాయ నీటి సౌలభ్యం ఉండేలా రూ.4కోట్లతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. రూ.2కోట్లతో బోర్ల ఫ్లషింగ్, డీపనింగ్, తదితర పనులు చేపడతామన్నారు. షాపూర్ తాగునీటి పథకం ద్వారా 25 గ్రామాలకు 24గంటలపాటు నిరంతరాయంగా తాగునీటి సరఫరా జరిగేలా రూ.10కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బోరం, గూడురు, షాపూర్ పథకాల పునరుద్ధరణ వల్ల భగీరథ పథకంపై కొంత భారం తగ్గుతుందన్నారు.

కాళ్లు మొక్కుతాం..

డంపుయార్డు చేయవద్దు

కలెక్టర్ కాంత్రిని వేడుకున్న గుండ్లమాచునూరు గ్రామస్తులు

హత్నూర(సంగారెడ్డి) : గుండ్లమాచునూరు గ్రామ సమీపంలోని కంది మండలం ఆరట్ల శివారులో సంగారెడ్డి పట్టణానికి చెందిన డంపు యార్డు ఏర్పాటుకు గురువారం కలెక్టర్ క్రాంతి స్థలాన్ని పరిశీలించారు. అక్కడి వచ్చిన గుండ్లమాచినేని గ్రామస్తులు.. 'కాళ్లు మొక్కుతాం మేడం.. ఇక్కడ డంపు యార్డు ఏర్పాటు చేయొద్దు' అని వేడుకున్నారు.ఇప్పటికే పరిశ్రమల కాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాపోయారు. ఈ ప్రభుత్వ స్థలంలో ఆస్పత్రిని నిర్మించాలని వేడుకున్నారు. సమస్య పరిష్కారానికి విచారణ చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం గుండ్లమాచునూరు గ్రామ శివారులోని మోడల్ స్కూల్ ను కలెక్టర్ సందర్శించారు. అక్కడ ఇంగ్లిష్ చదవడంలో విద్యార్థి ఇబ్బంది పడటం చూసి ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు ప్రదీప్‌ను పిలిచి మందలించారు. అనంతరం స్కూల్ భవనానికి జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు.

చెత్తను బయోమైనింగ్ చేయాలి

సంగారెడ్డి టౌన్ : డంపు యార్డుకు వచ్చే చెత్తను బయోమైనింగ్ చేయాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. మండల పరిధిలోని పసల్వాది గ్రామ శివారులో డంపు యార్డుపై గ్రామస్తులు ఫిర్యాదు మేరకు గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురపాలక శాఖతో సష్టి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చేసుకున్న ఒప్పందం మేరకు వర్షాలు తగ్గుముఖం పట్టగానే బయోమైనింగ్ పనులు వేగవంతం చేస్తారని తెలిపారు. రోజుకు 1500 మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ చేసేలా ప్లాంటును ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. డిసెంబర్ నెల వరకు ఈ ప్లాంట్ అందుబాటులోకి వస్తుందన్నారు. మండలంలోని ఇస్మాయిల్ ఖాన్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పాలిటెక్నిక్ కళాశాలను తనిఖీలు చేశారు. అంగన్వాడి కేంద్రాలలో కొత్తగా చేరిన వారి వివరాలను తెలుసుకున్నారు. పోతిరెడ్డిపల్లి లోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, సంగారెడ్డి మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, తహసీల్దార్లు దేవదాసు, పర్వీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ఎంపీఓ యూసుఫ్, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఫసల్వాది గ్రామ శివారులోని డంపు యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కొడిపల్లి(నర్సాపూర్): రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు కొడిపల్లి మండలం తునికి ఎంజేపీ (మహాత్మా జ్యోతిబాపూలే) బీసీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హరిబాబు గురువారం తెలిపారు. తూప్రాన్‌లో జరిగిన జిల్లా స్థాయి ఖోఖోలో తునికి ఎంజేపీ 9వతరగతి విద్యార్థులు ప్రశాంత్, శశికుమార్, రాకేశ్, 7వతరగతి విద్యార్థి నవదీప్ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. దీంతోపాటు డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు 200 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. పలువురు జిల్లా స్థాయిలో కాంస్య బహుమతి గెలిచినట్లు చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ హరిబాబు, కళాశాల స్పెషల్ ఆఫీసర్ జనార్దన్, ఏపీటీ లక్ష్మణ్, పవన్, విక్రమ్, పీడీ వెంకటేశం పీఈటీలు రవీందర్, కార్తీక్, శేఖర్ తదితరులు అభినందించారు. 13 నుంచి 15 వరకు హైదరాబాద్ మౌలాలీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సౌత్ జోన్ సైక్లింగ్ పోటీలకు..



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

నారాయణఖేడ్: ఈనెల 14, 15 తేదీల్లో నిజామాబాద్‌లో జరగనున్న ఖేలో ఇండియా ఉమెన్స్ సౌత్ జోన్ పోటీలకు ఖేడ్ పట్టణంలోని ఈ తక్షిల పాఠశాల విద్యార్థినులు అర్చన, గ్రేసీ, శ్వేత ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ.మల్లారెడ్డి, ఇతర బాధ్యులు విజయకాంతారావు, రమేష్ తెలిపారు. సౌత్‌జోన్‌తోపాటు జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభచూపుతామని విద్యార్థినులు ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థిలను పాఠశాల కరస్పాండెంట్ శరత్‌కుమార్‌తోపాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా స్థాయికి 128 మంది


విద్యార్థులతో పీడీలు, పీఈటీలు

జోగిపేట (అందోల్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ 14, అండర్ 17 అందోల్ మండల స్థాయి ఎంపికలను గురువారం జోగిపేట పట్టణంలో అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన ఈ సెలక్షన్స్‌లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ అంశాల్లో బాలుర, బాలికల విభాగం నుంచి 128 మంది క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఎంఈఓ కృష్ణ మాట్లాడుతూ.. మండల స్థాయిలో ఎంపికైన జట్లను జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని, అక్కడ ఉత్తమ ప్రదర్శన కనబరిచిన జట్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేస్తారన్నారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ నరేశ్, పీడీలు వీబీ శ్రీనివాస్, రామ కృష్ణ, సుభాష్ గౌడ్, కృష్ణ, రాజగౌడ్, అశోక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు, జరిమాన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తికి కోర్టు జైలు, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. వివరాల్లోకి వెళితే.. 2019లో మద్దూరి వీరయ్య కల్లు దుకాణంలో పగిలిన గాజు సీసా ముక్కలను అదే గ్రామానికి చెందిన కుమ్మరి యాదయ్యకు చెందిన ఖాళీ స్థలంలో వేయడంతో గొడవ జరిగింది. తాగిన మైకంలో వీరయ్య మాంసం నరికే కత్తితో యాదయ్యపై దాడికి దిగి గాయపర్చాడు. అడ్డొచ్చిన యాదయ్య తమ్ముడు సంగమేశ్వర్‌పై దాడి చేశాడు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా అసిస్టెంట్ సెషన్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్ ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి రత్నయ్య, సంగారెడ్డి టౌన్ ఎస్‌ఐ గోపాల్, సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్, పీపీ నిర్మల, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ రవి, రాజశేఖర్, కోర్ట్ లైజనింగ్ అధికారి సత్యనారాయణ ఎస్‌ఐలను ఎస్పీ రూపేశ్ అభినందించారు.

వక్ఫ్ భూములపై కోటి ఆశలు

- జహీరాబాద్ డివిజన్ పరిధిలో 13 వేల ఎకరాలు వక్ఫ్‌లో..
- 2018 నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం
- పెళ్లిళ్లు, పేరంటాలకు అమ్ముకుందామన్నా కుదరని వైనం
- తండ్రి మరణిస్తే కుమారుల పేరుపై మార్పుకు నో
- ఆందోళన చెందుతున్న రైతాంగం
- చట్ట సవరణతోనైనా న్యాయం జరుగుతుందనే ఆశ


వక్ఫ్‌బోర్డు పరిధిలో నుంచి తమ భూములు తప్పించాలని ఆందోళన చేస్తున్న బాధితులు(ఫైల్)

తాత, ముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న వేలాది ఎకరాల వ్యవసాయ భూములను ఒక్కసారిగా వక్ఫ్ బోర్డు కిందకు చేర్చారు. 2018 వరకు రికార్డుల్లో ఎలాంటి అభ్యంతరాలు లేకపోగా ఆ తర్వాతే అవస్థలు మొదలయ్యాయి. ధరణి పోర్టల్ వచ్చాకే వక్ఫ్ కింద చేర్చడంతో రైతు బంధు రాక పోవడం, రైతు బీమాకు నోచుకోవడం పోవడం, పండించిన పంటను మార్కెట్లో అమ్ముకోవాలన్నా ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు కాకపోవడంతో రైతులు దిక్కు తోచని స్థితికి చేరారు. తండ్రి మరణిస్తే కుమారుల పేరిట పట్టా మార్పు కాలేదు.. కుమార్తెల పెళ్లిళ్లు చేసేందుకు భూములు అమ్ముకుందామన్నా రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. ఇటీవలె కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో సవరణలు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుండగా తమకు న్యాయం జరుగుతుందని జహీరాబాద్ డివిజన్ పరిధిలోని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

జహీరాబాద్: జహీరాబాద్ డివిజన్ పరిధిలో 13,500 ఎకరాల వ్యవసాయ భూమి వక్ఫ్ పరిధి కింద ఉన్నట్లు అధికారులు చూపుతున్నారు. 1954 సంవత్సరం నుంచి రికార్డుల్లో తమ పెద్దల పేర్లు ఉన్నాయని, అయినా కావాలని వక్ఫ్ కిందకు చేర్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. గతంలో 65వ జాతీయ రహదారిపై ఉన్న భూములను అమ్ముకొని ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసుకున్నామని, ఇప్పుడు అవి వక్ఫ్ కింద చూపుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో తాము ఏం చేయాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. వీటి పరిష్కారం కోసం అధికారులు, ప్రభుత్వం సైతం ఎలాంటి మార్గం చూపడం లేదంటున్నారు. పైగా వక్ఫ్ భూములు బోర్డు కిందకే చేర్చాలని కొన్ని రాజకీయ పార్టీల నేతలు చెబుతుండడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

వక్ఫ్ పరిధిలో 13 వేల ఎకరాలు

రాష్ట్రంలోనే అత్యధికంగా జహీరాబాద్ డివిజన్ పరిధిలో 13,500 ఎకరాల వ్యవసాయ భూమి వక్ఫ్ పరిధి కింద ఉన్నట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 23 వేల వరకు వ్యవసాయ భూములు వక్ఫ్ పరిధిలో చూపుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. కోహీర్ మండలంలో 8,141 ఎకరాలు, జహీరాబాద్ మండలంలో 2,971 ఎకరాలు, రాయికోడ్ మండలంలో 1,090 ఎకరాలు, ఝరాసంగం మండలంలో 323 ఎకరాలు, న్యాల్‌కల్ మండలంలో 365 ఎకరాలు వక్ఫ్ కింద చూపుతున్నారని రైతులు చెబుతున్నారు. ఇందులో మైనార్టీలతో పాటు దళితులు, గిరిజనులు సైతం అధిక సంఖ్యలో బాధితులుగా ఉన్నారు. మండల కేంద్రమైన కోహీర్ పట్టణంలో 3,366 ఎకరాలు, కవేలిలో 733 ఎకరాలు, కొత్తూర్(కె)లో 536 ఎకరాలు, మధిరిలో 400 ఎకరాలు, పిచరాగడి గ్రామంలో 2,182 ఎకరాలు వక్ఫ్ కింద తమ భూములు చూపుతున్నారని రైతులు వాపోతున్నారు. జహీరాబాద్ మండలం సత్వార్‌లో 877 ఎకరాలు, ధనాసిరిలో 239 ఎకరాలు, మాడ్గిలో 261 ఎకరాలు ఉన్నట్లు చూపుతున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సవరణలతో న్యాయం జరుగుతుందని..

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో సవరణలు తెచ్చేందుకు గాను చేస్తున్న ప్రయత్నాలతో అయినా తమకు న్యాయం జరుగుతుందని రైతులు ఆశగా ఉన్నారు. కేంద్రం చట్ట సవరణ కోసం జాయింట్ పార్లమెంట్ కమిటీని ఏర్పాటు చేసి అందరి నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. తెలంగాణ నుంచి జేపీసీ సభ్యురాలిగా ఉన్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ బుధవారం జహీరాబాద్ వచ్చి వక్ఫ్ భూ బాధితుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు వేయి మంది రైతులు ఆమెకు సంతకాలతో కూడిన వినతి పత్రాలను అందజేశారు.

జేపీసీ ఎదుట వాదనలు వినిపిస్తాం



వాస్తవ పరిస్థితుల గురించి జాయింట్ పార్లమెంట్ కమిటీ ముందు తమ వాదనలు బలంగా వినిపిస్తాం. అవసరం అయితే జేపీసీ క్షేత్ర పర్యటనకు వచ్చి రైతులతో సమావేశమై వాస్తవాలు తెలుసుకోవాలి. 1954 సంవత్సరం కంటే ముందు నుంచే రైతులు భూములను సాగు చేసుకుంటున్నారు. తాత ముత్తాతల కాలం నుంచే భూములు రైతుల చేతుల్లో ఉన్నాయి. ఇప్పుడు అర్ధాంతరంగా వక్ఫ్ భూములు అనడంలో అర్థం లేదు.

–పీ.వెంకటేశ్వర్ రెడ్డి, రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షుడు, జహీరాబాద్

భూములన్నీ వక్ఫ్‌విగా చూపుతున్నారు



మండల కేంద్రమైన కోహీర్ పట్టణంలో అత్యధికంగా 3,366 ఎకరాల భూములను వక్ఫ్ కింద చూపుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. అంతే కాకుండా అవసరాలకు అమ్ముకుందామన్నా రిజిస్ట్రేషన్లు కావడం లేదు. దీంతో పేదలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తండ్రి మరణిస్తే వారి సంతానం పేరిట పట్టా మార్పు కావడం లేదు. సమస్యకు వెంటనే ఫులిస్టాప్ పెట్టి రైతులకు న్యాయం చేయాలి.

–చావిడి జగన్నాథ్ రెడ్డి, వక్ఫ్ భూ బాధితుడు, కోహీర్

మానసిక వేదనతో చనిపోయాడు



మా నాన్న బూచనెల్లి మొగులప్ప 65వ జాతీయ రహదారిపై ఉన్న సొంత భూమి అమ్ముకొని గ్రామంలోని సర్వే నం.16లో 9 ఎకరాల భూమిని 11 ఏళ్ల కిందట కొన్నాడు. దాన్ని వక్ఫ్ కిందకు చేర్చారు. సమస్య పరిష్కరించాలంటూ అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ నాలుగేళ్లు తిరిగినా పరిష్కారం కాలేదు. దీంతో మానసికంగా కుంగిపోయి నాలుగేళ్ల కిందట చనిపోయాడు. ఇప్పటికైనా తమకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చూడాలి.

–అంజయ్య, వక్ఫ్ భూ బాధితుడు, సత్వార్

గీత కార్మికులకు రక్ష 'కాటమయ్య కిట్స్'


కిట్లపై శిక్షణ ఇస్తున్న అధికారులు

బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగదీశ్

సంగారెడ్డి : కాటమయ్య సేఫ్టీ కిట్స్‌తో గీత కార్మికులు ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవచ్చని బీసీ సంక్షేమ జిల్లా అధికారి జగదీష్ అన్నారు. గురువారం జిల్లాలోని 41 మంది గీత కార్మికులకు సుల్తాన్పూర్ సమీపంలో కొర్పోల్ రోడ్డులో కాటమయ్య సేఫ్టీ కిట్స్ వినియోగంపై శిక్షణ కార్యక్రమాన్ని ఎక్సైజ్ శాఖ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాడు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు నుంచి చెట్టు పైనుంచి పడి ఎంతో గీత కార్మికులు చనిపోతున్నారన్నారు. కార్మికులు చెట్టు ఎక్కిన ప్పుడు మోపు జారకుండా ఉండేందుకు కిట్టుకు ధృడమైన బెల్ట్ తాడు, మూడు క్లిప్పులు ఉంటాయన్నారు. గీత కార్మికులు చెట్టు ఎక్కే సమయంలో తప్పకుండా కిట్‌ను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్ మాణమ్మ, జోగిపేట సీఐ సాగర్‌రెడ్డి, సహాయ వెనుకబడిన తరగతులు అభివృద్ధి అధికారులు అమర జ్యోతి, భాగ్యలక్ష్మి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పూడ్చిన శవానికి పోస్టుమార్టం


మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు

కొల్చారం(నర్సాపూర్): పూడ్చిన శవాన్ని మళ్లీ వెలికి తీసి పోస్టుమార్టం చేసిన ఘటన మండలంలోని రాంపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన సామల సుభాష్(50) ఆగస్టు 26న గ్రామానికి చెందిన సామల సుభాష్ అనే ప్రభుత్వ ఉద్యోగి అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సుభాష్ భార్య ఇద్దరు ఆడపిల్లలతో కలిసి 15 ఏళ్ల నుంచి భర్తకు దూరంగా ఉంటూ వస్తుంది. సుభాష్ మృతి పై అనుమానాలు ఉన్నాయంటూ వారం కిందట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కోర్టు అనుమతితో మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, తహసీల్దార్ గఫూర్ మియా ఘటనా స్థలానికి చేరుకొని పూడ్చిన శవాన్ని బయటకు తీసి పంచనామ నిర్వహించారు. ఫోరెన్సిక్ వైద్య సిబ్బంది సుభాష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, తిరిగి పూడ్చి వేశారు. ఘటన జరుగుతున్నంతసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

18 నుంచి డీఈడీ పరీక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డీఈడీ ద్వితీయ సంవత్సర పరీక్షలు 18 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి 30నిముషాల ముందుగా చేరుకోవాలన్నారు.

పత్తి పంటలు పరిశీలన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఇటీవల వర్షాలు కురిసి పంటలు పాడైపోయిన నేపథ్యంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం పలు గ్రామాల్లో పంటలు పరిశీలించారు. రాహుల్ విశ్వకర్మ, సరిత ఏడీఏ వెంకట లక్ష్మి, ఏవో రమేశ్‌తో కలిసి మండల పరిధిలోని ఆత్మకూర్, వెల్టూర్, మాచిరెడ్డిపల్లి, పొట్టిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

చెరువులో గల్లంతై.. నాలుగు రోజులకు శవమై

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి


వెంకటి (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి చెరువులో గల్లంతైన వ్యక్తి నాలుగు రోజులకు శవమై తేలాడు. చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన రూపుల వెంకటి (37) సోమవారం నల్ల చెరువు పక్కనే ఉన్న పంట పొలాల్లో గాలాలతో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో నల్లచెరువులో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ విషయంపై పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. గురువారం పోలీసులు, గ్రామస్తులు కలిసి చెరువులో వెతుకుతుండగా చేపల వలకు చిక్కుకొని మృతదేహం కనిపించింది. భార్య రేఖ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. శవ పంచనామ నిర్వహించి పోస్ట్‌మార్టం కోసం రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. తహసీల్దార్ మన్నన్, ఆర్‌ఐ చంద్రశేఖర్ వివరాలు నమోదు చేసుకున్నారు.

సెల్ ఫోన్ల దొంగలు అరెస్ట్



తూప్రాన్: సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను పట్టుకున్నట్లు ఎస్‌ఐ శివానందం గురువారం పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ కారులో అనుమానాస్పదంగా నలుగురు వ్యక్తులు కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా సెల్ ఫోన్ల దొంగతనానికి పాల్పడుతున్న ఒప్పుకున్నారు. వెంటనే వారి నుంచి 17 సెల్ ఫోన్లు, రూ.5 వేల నగదు, కారును స్వాధీనం చేసుకున్నాం. నిందితుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన రవికుమార్, కర్నూల్ జిల్లా ఎమ్మిగనూర్‌కు చెందిన సత్పాడి అరవింద్‌తోపాటు మరో ఇద్దరు మైనర్లు ఉన్నారు. దొంగతనం చేసిన సెల్‌ఫోన్లను ప్రధాన నిందుతుడు ప్రభ తీసుకొని డబ్బులు ఇచ్చేవాడని తెలిపారు. ప్రభ పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వైద్యం వికటించి యువకుడు మృతి

ఆర్‌ఎంపీ ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన


ప్రశాంత్ (ఫైల్)

హత్నూర (సంగారెడ్డి): వైద్యం వికటించి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన హత్నూర మండలం చింతల్ చెరువులోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన కంచు గారి భిక్షపతి, కృష్ణమ్మల ఏకైక కుమారుడు ప్రశాంత్(23) నర్సాపూర్‌లోని ఓ కారు షోరూంలో పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి ఇంటికొస్తున్న క్రమంలో బైక్ పై నుంచి పడి గాయాలయ్యాయి. కుటుంబీకులు గురువారం ప్రశాంత్‌ను చింతల్ చెరువులోని ఆర్‌ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకెళ్లగా చికిత్స చేసి ఇంజక్షన్ ఇచ్చాడు. అనంతరం వడ్డేపల్లిలోని ఇంటికి తీసుకురాగా కొద్దిసేపటికి ప్రశాంత్‌కు కడుపునొప్పి రాగా సంగారెడ్డి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

ఆర్‌ఎంపీ వల్లే చనిపోయాడని ఆందోళన

చింతల్ చెరువులోని ఆర్‌ఎంపీ వైద్యుడి వల్లే తమ కుమారుడు చనిపోయాడని కుటుంబీకులు, గ్రామస్తులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఆందోళన తీవ్రతరం కావడంతో కొంత డబ్బు ఇస్తానని వైద్యుడు ఒప్పుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్‌ఐ సుభాష్‌ను వివరణ కోరగా.. ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. ఇదిలా ఉండగా, కొన్ని నెలల కిందటే ఈ ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారి సీజ్ చేశారని, అయినా మళ్లీ ఓపెన్ చేసి చికిత్స చేస్తున్నారని గ్రామస్తులు, స్థానికులు ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో మరో యువకుడు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. హైదరాబాద్ ఈసీఎల్‌కు చెందిన సాయి అనురాగ్(25) హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓ కంపెనీలో సేల్స్‌మాన్‌గా పని చేస్తున్నాడు. గురువారం కంపెనీ పని నిమిత్తం పై సంగారెడ్డికి వచ్చాడు. తిరిగి సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వైపు వస్తుండగా మార్గమధ్యలో లక్డారం డిమార్ట్ స్టోర్స్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేలూరులో విద్యుదాఘాతంతో..


దీపక్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం వర్గల్ మండలం వేలూరులో చోటు చేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తుల కథనం మేరకు.. వేలూరుకు చెందిన దాచారం కృష్ణ, ఇందిర దంపతులకు వంశీ, దీపక్ (21) ఇద్దరు కుమారులున్నారు. వంశీ బైక్ మెకానిక్ కాగా చిన్న కొడుకు దీపక్ మోటార్ వైండింగ్ పనులు చేస్తూనే, వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటాడు. అడవి పందుల బారినుంచి మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు చేను వద్ద మంచెను వేయాలనుకున్నాడు. గురువారం తండ్రితో వెళ్లిన దీపక్ చేను వద్ద మంచె కోసం కొమ్మలు నరికి తెచ్చే ప్రయత్నంలో కరెంటు తీగలకు కొమ్మలు తాకాయి. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ములుగు సమీప ఆర్వీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామని ఎస్సై కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

బైక్ చెట్టును ఢీకొని..


అనురాగ్(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పెద్దగొట్టిముక్కుల గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సికింద్లాపూర్ పంచాయతీకి చెందిన అజయ్ (30) బైక్‌పై బుధవారం రాత్రి నర్సాపూర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. పెద్దగొట్టుముక్కుల గ్రామ ప్రధాన రహదారిపై అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై మృతి చెందాడు. గురువారం ఉదయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

రైల్వే బ్రిడ్జి రేలింగ్‌ను ఢీకొట్టిన బస్సు

బైక్‌ను తప్పించే క్రమంలో ప్రమాదం


బ్రిడ్జి పైన వేలాడుతున్న బస్సు

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై అదుపుతప్పిన ఓ ప్రైవేటు బస్సు రేలింగ్‌ను ఢీకొట్టింది. వివరాల్లోకి వెళ్తే.. గురువారం మధ్యాహ్నం జహీరాబాద్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన బస్సు డ్రైవర్ కె.రాజు కార్మికులను దిగ్వాల్‌లోని ఓ కర్మాగారానికి తీసుకెళ్లేందుకు ఇంటినుంచి ఒక్కడే బయలు దేరాడు. ఇదే సమయంలో జహీరాబాద్ నుంచి తాండూర్ వెళ్లే రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఎదురుగా మోటారు సైకిల్‌పై వస్తున్న వ్యక్తి సెల్‌ఫోన్ చూసుకుంటూ వస్తుండడంతో బస్‌ను గమనించలేదు. అతడిని తప్పించే క్రమంలో బస్సును కుడివైపు తిప్పి బ్రేక్ వేయగా అదుపుతప్పి రేలింగ్‌ను ఢీకొట్టింది. బస్సు బ్రిడ్జిపై నుంచి కింద పడకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బస్సు ప్రమాదానికి గురి కావడంతో బ్రిడ్జిపై రాక పోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

క్యూఆర్‌కోడ్ మిషన్‌కు బాక్స్ ఫిట్టింగ్ అంటూ..

ఓ వ్యాపారి ఖాతా నుంచి రూ.1.28 లక్షలు అపహరణ

నర్సాపూర్ : నర్సాపూర్‌కు చెందిన ఇమ్మడి విశ్వనాథం కిరాణా దుకాణానికి బుధవారం సాయంత్రం ఓ కంపెనీ పేరుతో ఉన్న టీ షర్టు ధరించి ఆగంతకుడు వచ్చాడు. మీ క్యూఆర్ కోడ్ మిషన్‌కు సౌండ్ బాక్స్ బిగించడానికి వచ్చానని నమ్మబలికాడు. ఇది నమ్మిన వ్యాపారి సరే అనడంతో పని మొదలు పెట్టాడు. బాక్స్ బిగించానని చెక్ చేసుకోమని చెప్పాడు. విశ్వనాథం తన ఖాతా నుంచి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఒక రూపాయి వేశాడు. తాను చెక్ చేస్తానని చెప్పి అగంతకుడు వ్యాపారి మొబైల్ ఫోన్ తీసుకున్నాడు. విశ్వనాథం బ్యాంకు ఖాతా నుంచి రూ.1.28 లక్షలను అతడి ఖాతాలో వేసుకొని ఉడాయించాడు. కొద్ది సేపటికి దీన్ని గుర్తించిన వ్యాపారి సైబర్ క్రైమ్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్‌ఐ లింగంతో ప్రస్తావించగా తన దృష్టికి వచ్చిందని, సైబర్ క్రైం స్టేషన్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడని, సైబర్ క్రైమ్ అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. అక్కడ కేసు నమోదు చేయని పక్షంలో తాము నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

వాకింగ్‌కు వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ


నారాయణఖేడ్ : చిందరవందరగా వస్తువులు

నారాయణఖేడ్: పట్టణంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి కథనం మేరకు.. మెదక్ జిల్లా రేగోడు మండలం కొండాపూర్‌కు చెందిన ప్రభాకర్ ఖేడ్‌లోని మైనార్టీ బాలికల గురుకులం వెనుక ప్రాంతంలో ఉంటూ ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో భోజనాలు చేశాక ఇంటి తలుపులు తెరిచి భార్యతో కలిసి వాకింగ్‌కు కొంతదూరం వెళ్లాడు. తిరిగొచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ప్రభాకర్ భార్య శ్రీకన్యకు చెందిన హ్యాండ్ బ్యాగ్‌ను ఎత్తుకెళ్లారు. అందులో 6.5 తులాల బంగారం, 5 తులాల వెండి నగలు ఉన్నట్లు బాధితులు తెలిపారు. ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

32 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- స్టేషన్ నుంచి పరారైన నిందితుడు

సదాశివపేట(సంగారెడ్డి): అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేయగా, అందులో ఒకరు స్టేషన్ నుంచి తప్పించుకున్నాడు. సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో స్టార్ లైట్ హోటల్ సమీపంలో తెలంగాణ నార్కోటిక్ బ్యూరో సదాశివపేట పోలీసులు బుధవారం రాత్రి వాహనాలను తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి ముంబాయి వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు నుంచి దిగి మరో ట్రావెల్స్ బస్సు ఎక్కుతున్న ఇద్దరిని పోలీసులు తనిఖీ చేయగా 32 కిలోల ఎండు గంజాయి దొరికింది. ఒరిస్సాకు చెందిన ఇద్దరు చందురావు, ప్రకాశ్‌ను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తప్పించుకున్న నిందితుడు..

ఇద్దరు నిందితుల్లో ఒకడైన చందురావు గురువారం ఉదయం బాత్‌రూమ్ వెళ్తానని చెప్పి పోలీసుల కళ్లుగప్పి స్టేషన్ నుంచి తప్పించుకున్నాడు. అతడిని పట్టుకునే ప్రయత్నంలో కానిస్టేబుల్ అసద్‌కు గాయాలయ్యాయి. ఆ సమయంలో విధుల్లో ఎస్కార్టుగా అసద్, శివకుమార్, గార్డ్ ఇన్‌చార్జిగా దేవి ప్రసాద్ ఉన్నట్లు సమాచారం. పారిపోయిన నిందితుడిని పట్టుకునేందుకు సీఐ మహేశ్‌గౌడ్, ఎస్‌ఐలు, సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్రమంగా తరలిస్తున్న 23 క్వింటాళ్ల 90 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పర్శరాములు గురువారం తెలిపారు. అల్వాల గ్రామానికి చెందిన ముంద్రకొలుపుల కిరణ్‌కుమార్ అనే వ్యక్తి అశోక్ లేలాండ్ బీరింగ్ నో వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా అల్వాల గ్రామ శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని మిరుదొడ్డి రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.